సాక్షి
జగిత్యాల
సోమవారం । 21 । జూలై । 2025

గోదావరిలో భక్తుల రద్దీ

ధర్మపురి: ధర్మపురిలోని గోదావరిలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో భారీగా తరలివచ్చారు. గంగమ్మ, గౌరమ్మలకు మొక్కులు చెల్లించారు.



న్యూస్‌రీల్

గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరా

- ఎన్పీడీసీఎల్ డీఈ రాజిరెడ్డి



పోరండ్ల సబ్‌స్టేషన్‌లో ఫీడర్ బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న డిఇ రాజిరెడ్డి

జగిత్యాలరూరల్: గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమున్న చోట సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయడంతోపాటు సబ్‌స్టేషన్ల కెపాసిటీ పెంచుతున్నామని ఎన్పీడీసీఎల్ జగిత్యాల డీఈ అన్నాడి రాజిరెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్త విద్యుత్ ఫీడర్‌ను ప్రారంభించారు. ప్రజలందరికీ నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని వివరించారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ స్తంభాలు కొత్తవి అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏడీఈ జవహర్ లాల్ నాయక్, ఏఈ సుందర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పోలీసులు

జగిత్యాలరూరల్: జిల్లాలో 1989 పోలీస్ కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన పోలీసులు వివిధ హోదాల్లో పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఇదే బ్యాచ్‌కు చెందిన వివిధ ఘటనల్లో అమరులైన పోలీసులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో జగిత్యాల స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై రాజేశుని శ్రీనివాస్, ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ బోయిన శ్రీనివాస్, జగిత్యాల ఇంటెలిజెన్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి వావిలాల గంగాధర్ పాల్గొన్నారు.

చెరువుల సమీపంలోనే నిర్మాణాలు

బఫర్ జోన్‌లో యథేచ్ఛగా కట్టడాలు

- వరద ప్రవాహానికి అడ్డుగా పనులు
- ప్రజలకు పొంచి ఉన్న ముప్పు
- ఎక్కడా కనిపించని హద్దులు

జగిత్యాల: జిల్లాకేంద్రం చుట్టూ ఐదు గొలుసుకట్టు చెరువులు ఉన్నాయి. వాటికి సమీపంలోనే ఇళ్ల నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వర్షకాలంలో వరదనీటి ప్రవాహానికి అడ్డుగా నిర్మాణాలు చేపడుతుండడంతో సమీపంలోని ఇళ్లను ముంచెత్తుతోంది. స్థానికుల ఫిర్యాదు మేరకు జిల్లాకేంద్రం శివారులోని చింతకుంట చెరువును కలెక్టర్ సత్యప్రసాద్ ఇటీవల పరిశీలించారు. బఫర్‌జోన్‌లోనే అత్యధికంగా నిర్మాణాలు ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ కట్టడాలు ఉంటే కోర్టు ద్వారా నోటీసులు జారీ చేయాలని నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు.



మోతె చెరువును ఆనుకుని ఉన్న భవనాలు

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

జిల్లాకేంద్రం చుట్టూ ఉన్న ఐదు చెరువులకు సమీపంలోనే కొత్తకొత్త ఇళ్లు వెలుస్తున్నాయి. ఇందులో అధికంగా బఫర్‌జోన్‌తోపాటు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నా.. అధికారులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇలా చెరువులు మొత్తం కబ్జాకు గురైతే ప్రజలకు ఇబ్బందికరంగా మారనుంది. వర్షకాలంలో వరద ప్రవాహం వెళ్లే దారి లేక ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉంది.

ఫైపాండ్స్ ఆఫ్ సిటీ ఎక్కడ?

జిల్లా కేంద్రాన్ని ఆనుకుని మోతె, అంతర్గాం, చింతకుంట, కండ్లపల్లి, గోవిందుపల్లి గొలుసుకట్టు చెరువులను కలిపి ఫైపాండ్స్ ఆఫ్ సిటీ అని చెబుతుంటారు. ప్రస్తుతం ఆ చెరువులన్నీ ఆక్రమణలకు గురయ్యాయి. ముఖ్యంగా మోతె, కండ్లపల్లి, చింతకుంట చెరువుల సమీపంలోనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. గతంలో నిర్మించినవే అధికంగా బఫర్‌జోన్‌లో ఉన్నాయని అనుకుంటే.. కొత్తగా అనేక ఇళ్లు ఇక్కడ వెలిశాయి. మోతె చెరువు 406 సర్వేనంబరులో 90.23 ఎకరాలు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం అది 40ఎకరాలు కూడా లేదు. దాని చుట్టూ ప్రాంతాల్లో ఎఫ్‌టీఎల్ భూములు అయినప్పటికీ పెద్దపెద్ద భవనాలు నిర్మించారు. ప్రధాన చెరువైన మోతె చెరువుకు అంతర్గాం నుంచి ధరూర్, నర్సింగాపూర్ మీదుగా కెనాల్ నీరు వస్తుంది. మోతె చెరువు నుంచి ముప్పారపు చెరువుకు నీరు వెళ్తుంది. ఈ కాలువ సైతం కబ్జాకు గురికావడంతో భారీ వర్షాలు కురిసినప్పుడు వరద ప్రవాహం ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉంది. గోవిందుపల్లి సమీపంలో ఉన్న వెంకటాద్రినగర్‌లో కాలువ పూర్తిస్థాయిలో కబ్జాకు గురికావడంతో పట్టణంతోపాటు వెంకటాద్రినగర్‌కు రాకపోకలు స్తంభించిపోతాయి. ఎఫ్‌టీఎల్ భూముల్లో అనేక ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

చెరువులకు హద్దులు ఎక్కడ?

జిల్లా కేంద్రంలో చుట్టూ ఉన్న చెరువులకు హద్దులు లేకపోవడం కూడా ఇబ్బందికరంగా మారింది. మూడు రోజుల్లో హద్దులు నిర్ణయించి మ్యాప్‌లు ఇవ్వాలని కలెక్టర్ సత్యప్రసాద్ నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో అత్యధికంగా భూముల ధరలు పెరగడంతో చెరువులు, భూములను కబ్జా చేస్తూ ఇంటి నిర్మాణాలను చేపడుతున్నారు. హద్దులు ఏర్పాటు చేసి బౌండరీలు ఏర్పాటు చేస్తే కబ్జాకు గురికాకుండా ఉంటాయి. మొత్తం హద్దులు నిర్ణయించి ఏ మేరకు కబ్జా అయ్యాయో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

కాలువల్లో ముళ్లపొదలు

చెరువులకు సంబంధించిన కాలువల్లో ముళ్ల పొదలు పేరుకుపోయాయి. దీంతో నీరు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. చెరువులు నాలుగు వైపులా ఉండటం.. కాలువలు పిచ్చిమొక్కలతో నిండిపోవడం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో నీరు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల కలెక్టర్ చొరవ తీసుకుని జిల్లా కేంద్రంలోని నాలాల వద్దనున్న ముళ్లపొదలను తొలగించేలా చర్యలు తీసుకోవడంతో కొద్దిమేర క్లీన్ అయ్యాయి. ప్రజావాణిలోనూ కలెక్టర్‌కు చెరువుల కబ్జాపై అత్యధిక ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్‌లో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న హైడ్రా తరహాలో ఇక్కడ కూడా కొత్త వ్యవస్థ రావాలని స్థానికులు ఆశిస్తున్నారు.



చింతకుంట చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్

అక్రమ కట్టడాలపై చర్యలు



జిల్లాలోని చెరువుల చుట్టూ అత్యధికంగా బఫర్‌జోన్లు, ఎఫ్‌టీఎల్‌లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు దృష్టికి వచ్చింది. అధికారులను ఆదేశించాం. అక్రమ కట్టడాలున్నట్లయితే నోటీసులు జారీ చేయాలని సూచించాం. ప్రధాన నాలాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా ఆదేశాలు జారీ చేశాం.

– సత్యప్రసాద్, కలెక్టర్

ముమ్మరంగా వరి నాట్లు



అలూర్‌లో వరి నాట్లు వేస్తున్న మహిళలు

- వర్షం నీరు అంతంతే
- వ్యవసాయబావులపైనే ఆధారం
- నాట్ల సమయంలో రైతన్నల ఇబ్బందులు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వరినాట్లు ఊపందుకున్నాయి. జూన్ 15 తర్వాత నారు పోసిన రైతులు.. ఇప్పుడు నాట్లు వేస్తున్నారు. పొలం దున్నేందుకు సమృద్ధిగా వర్షాలు లేకపోవడంతో బావుల ద్వారా నీరు అందిస్తున్నారు. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 3.10 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారుల అంచనా. ఈ ఏడాది వర్షాలు అంతంతే ఉండటంతో ఏ మేరకు వరి సాగు చేస్తారనేది అంచనా వేయలేకపోతున్నారు. మేడిపల్లి, కథలాపూర్, కొడిమ్యాల, మల్యాల వంటి మండలాలు నాన్‌కమాండ్ ప్రాంతాలు. ఇక్కడ సాగునీటికి ఇబ్బందే. కాలువల కింద ఉన్న రైతులందరికీ దాదాపు వ్యవసాయ బావులు ఉన్నాయి. ఇప్పటివరకు కాలువల ద్వారా నీరు రాకున్నా.. ఉన్న వ్యవసాయ బావుల ద్వారా నీరు అందించి పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఎస్సారెస్పీ నిండితే సాగునీరు వచ్చే అవకాశం ఉంటుందనే ఆశతో కూడా నార్లు పోసి నాట్లు వేస్తున్నారు.

వ్యవసాయ బావులపైనే ఆధారం

వర్షాలు కురవకపోవడంతో పొలాల దున్నకం రైతులకు ఇబ్బందిగా మారింది. బావులకు మోటార్లు బిగించి పొలానికి తడులు పెడుతున్నారు. రైతులందరూ ఒకేసారి మోటార్లు ఆన్ చేస్తుండడంతో ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ ఎక్కువై కరెంట్ ట్రిప్ అవుతోంది. కొన్ని ప్రాంతాలోల ఫ్యూజులు కాలిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నారు ముదిరిపోతోంది. నారు పోసిన నెలలోపు నాట్లు వేస్తే మంచి దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు సూచిస్తుండడం.. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన పెరిగింది.



వరి నారును తరలిస్తున్న రైతు

నారు తరలించడం ఇబ్బందే..

సాధారణంగా రైతులు ఎన్ని ఎకరాల పొలం ఉన్నా.. నారును ఒకేచోట పోస్తుంటారు. నారు ఏపుగా పెరిగాక పొలంలో పంచడం రైతులకు ఇబ్బందిగా మారింది. నారును చీరలో లేదా తట్టు కవర్లలో పెట్టుకుని మడుల్లోకి వెళ్లి వేయాల్సి రావడం కష్టమవుతుంది. కూలీలు నారును పంచేందుకు దొరకడం లేదు. ఎక్కడైనా దొరికితే వారం ముందే అడ్వాన్స్‌లు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొంది. మగకూలీలకు రోజుకు కనీసం రూ.వెయ్యితోపాటు మద్యం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాటు వేసేందుకు ఆడకూలీలకు రూ.500 ఇస్తున్నారు.

ఆకాశాన్నంటిన డీఏపీ ధరలు

నాట్లు వేసే సమయంలో రైతులు డీఏపీ వేస్తుంటారు. డీఏపీ ఒక బస్తా ధర రూ.1400వరకు ఉంది. మార్కెట్‌లో సరిగ్గా దొరకకపోవడంతో బ్లాక్‌లో మరింత రేటు పెట్టి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. నాటు వేసిన వారం లోపు కలుపు మొక్కలు రాకుండా గడ్డి మందు చల్లుతున్నారు.

నాట్లకు ఇబ్బందులు



నాట్ల సమయంలో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దున్నడానికి ట్రాక్టర్ వస్తే పొలంలో నీరు ఉండడం లేదు. నీరు ఉంటే ట్రాక్టర్ దొరకదు. దున్నిన తర్వాత నాటు వేయడానికి కూలీల కోసం తిరగాల్సిన పరిస్థితి ఉంది.

– బందెల మల్లయ్య, చల్‌గల్

వర్షాలు కురిస్తే బావుండు



వర్షాలు సమృద్ధిగా కురిస్తే ఒకే రోజులో దున్నడం పూర్తయ్యేది. ఇప్పుడు బావుల ద్వారా నీరు అందించాల్సి వస్తోంది. నీరు సరిపడా అందక పొలం దున్నడం కష్టంగా మారింది. నాటు వేసే సమయంలో రైతులు కష్టాలు పడాల్సి వస్తోంది.

సాయిరెడ్డి, సింగరావుపేట, రాయికల్(మం)

దేవుళ్లపై ఓట్టేసి మోసగించిన రేవంత్‌రెడ్డి

- బీజేపీ పాదయాత్రతో నిజాం షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించాలి
- జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి
- సోమేశ్వర కొండ వద్ద బీజేపీ పాదయాత్ర ప్రారంభం



సోమేశ్వర కొండ వద్ద పాదయాత్రను ప్రారంభించి మాట్లాడుతున్న పల్లె గంగారెడ్డి

మల్లాపూర్: దేవుళ్లపై ఓట్టేసి రైతులను మోసం చేసిన ఘనుడు సీఎం రేవంత్‌రెడ్డి అని జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి చేపట్టిన చలో ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ పాదయాత్రను మండలకేంద్రంలోని సోమేశ్వర కొండ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 100 రోజుల్లో ఫ్యాక్టరీలను ప్రభుత్వపరం చేస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ నడిచేవాటినే మూసివేయించారని తెలిపారు. ఫ్యాక్టరీలు నడిచిన సమయంలో 1.20 లక్షల ఎకరాల్లో చెరుకు సాగయ్యేదని, ఇప్పుడు 10వేల ఎకరాలకు పడిపోయిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే ఆర్నెల్లలోనే షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి మూసీనది సుందరీకరణ, అందాల పోటీలకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారని, రైతుల కోసం మాత్రం రూ.500 కోట్లు ఖర్చు పెట్టేందుకు మనసు రావడం లేదని తెలిపారు. అధ్యయన కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. షుగర్ ఫ్యాక్టరీలను తెరిచేవరకూ వరకు బీజేపీ రైతుల పక్షాన పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు చిట్నేని రఘు, నరేందర్, జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరిబాబు, మాజీ అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణరావు, మండల ఇన్‌చార్జి వడ్డేపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మీ, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బైన ప్రశాంత్, మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు, నాయకులు కాంతయ్యచారి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ వద్ద ముగిసిన పాదయాత్ర

పాదయాత్రలో వందలాది మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు, చెరుకు రైతులు పాల్గొన్నారు. మల్లాపూర్ నుంచి కుస్తాపూర్, సిరిపూర్, రాఘవపేట మీదుగా ముత్యంపేటలోగల షుగర్ ఫ్యాక్టరీ వద్దకు చేరుకుంది. ముగింపు సభల్లో రైతు సంఘం నాయకులు మాట్లాడారు. రైతులకు కమిటీలు, పాతబకాయిల చెల్లింపులు కాదని, ఫ్యాక్టరీలను తెరవడమేనని అన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ ఫ్యాక్టరీ అంశాన్ని వాడుకుందన్నారు. ముత్యంపేట ఫ్యాక్టరీ వద్ద జస చేసిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోపే పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి 18 నెలలైన పట్టించుకోవట్లేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పాదయాత్రతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, లేకుంటే చెరుకు రైతులతో కలిసి కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్రను అడ్డుకోవాలి

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాలటౌన్: రాజ్యాంగాన్ని మార్చే కుట్రను అడ్డుకోవాలని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రతి ఆదివారం అంబేడ్కర్ స్మరణలో భాగంగా ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ అధ్యక్షుడు నల్ల శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఈశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లాకేంద్రంలోని తహసీల్ చౌరస్తాలోగల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాజ్యాంగం గురించి ప్రజలకు వివరించేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. ప్రజలందరికీ సమాన హక్కులు రాజ్యాంగంతోనే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఓరుగంటి రమణారావు, బొల్లం రమేశ్, అనంతుల కాంతారావు, మద్దెల నారాయణ, బుర్ర ప్రవీణ్, జవ్వాజి శంకర్‌తో పాటు అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న కొప్పుల ఈశ్వర్

కలవరపెడుతున్న వరుస హత్యలు

- భూతగాదాలు, వివాహేతర సంబంధాలే కారణం
- జిల్లాలో నిత్యం ఏదోచోట సంఘటనలు
- పోలీసులు చర్యలు తీసుకుంటున్నా ఆగని వైనం

ఈనెల 17న.. వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన చల్లూరి మల్లేశ్ (30)ను మండలకేంద్రంలో కత్తులతో పొడిచి చంపారు. ఓ యువతిని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడనే కారణంతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు.

ఈనెల 5న కోరుట్ల పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన హితాక్షి (6)ని చిన్నారి చిన్నమ్మ మమత గొంతులో పొడిచి హత్యచేసింది. కుటుంబసభ్యులు తనను అడుగడుగునా అవమానిస్తున్నారని, హేళన చేస్తున్నారని పగ పెంచుకుని పథకం ప్రకారం చిన్నారిని హతమార్చింది.

ఈనెల 10న.. ధర్మపురి మండలం దోనూర్ గ్రామానికి చెందిన గొల్లెన రవి (30)ని వరుసకు అన్నయ్య అయిన నాగరాజు ఇంటి నిర్మాణం, భూ తగాదాలతో పగ పెంచుకుని కత్తితో దాడిచేసి హత్యచేశాడు.



వెల్గటూర్ మండల కేంద్రంలో హత్యకు గురైన మల్లేశ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, పోలీసులు (ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లాలో ఇలాంటి వరుస హత్యలు కలకలం రేపుతున్నాయి. అటు ప్రజలు, ఇటు పోలీసువర్గాల్లోనూ ఆందోళన మొదలైంది. నేర సంస్కృతిని తగ్గించేందుకు పోలీసులు హత్యల్లో ప్రమేయం ఉన్నవారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు రిమాండ్‌కు తరలిస్తున్నారు. గతంలో కేసులు ఉండి.. హత్యల్లో ప్రమేయం ఉన్నవారిపై రౌడీషీట్‌లు, పీడీయాక్ట్ నమోదు చేస్తున్నారు.

భూ తగాదాలు.. వ్యక్తిగత ద్వేషాలు

వరుస హత్యలకు ప్రధాన కారణం భూతగాదాలు, వ్యక్తిగత ద్వేషాలు, వివాహేతర సంబంధాలు, ప్రేమోన్మాదం, పరువు పోతుందనే ప్రధాన కారణంగా పోలీసుల విచారణలో వెల్లడవుతున్నాయి. మారుతున్న సమాజంలో టెక్నాలజీ, చట్టాలు తెలిసినా నేరం చేయడానికి నింధితులు వెనుకాడటం లేదు. చిన్నపాటి విషయాలకు కూడా క్షణికావేశంలో హత్యలకు పాల్పడుతున్నారు.

నిందితుల గుర్తింపులో టెక్నాలజీ

నేరాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న వారితోపాటు పరోక్షంగా వెనుక ఉండి ప్రోత్సహించిన వారిని కూడా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నారు. ప్రజలు నేరాలకు దూరంగా ఉండాలనే లక్ష్యంతోనే పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. చిన్నచిన్న గొడవలు జరుగుతున్న సమయంలో పోలీసులు కేసులు నమోదు చేసి నిందితులపై చర్యలు చేపడుతుండటంతో పెద్ద నేరాలు జరగకుండా అడ్డుకట్ట వేస్తున్నారు.

రౌడీషీట్, పీడీయాక్ట్ కేసులు

ఎవరిపైనన ఒకట్రెండు కేసులు ఉంటే వారిని నేర ప్రవృత్తి నుంచి దూరం చేసేందుకు పోలీసులు యత్నిస్తున్నారు. అలకాని పక్షంలో రౌడీషీట్, పీడీయాక్ట్ ఓపెన్ చేస్తున్నారు. హత్య కేసులో ప్రమేయం ఉంటే వారి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నారు. ఒకట్రెండు నాన్‌బెయిలబుల్ నేరాలకు పాల్పడినవారిపై రౌడీషీట్, పీడీయాక్ట్ ఓపెన్ చేస్తున్నారు. రౌడీషీటర్ల కదలికలపై పెట్రోలింగ్ సిబ్బంది, 100 డయల్ సిబ్బంది ఎప్పటికప్పుడు నిఘా పటిష్టం చేశారు.

నిందితులపై చర్యలు



నేరాలకు పాల్పడుతున్న నిందితులపై కఠిన చర్యలు చేపడుతున్నాం. ప్రోత్సహించిన వారిని కూడా టెక్నాలజీ సహాయంతో గుర్తిస్తున్నాం. ఒకట్రెండు కేసుల్లో పాల్గొంటే రౌడీషీట్, పీడీయాక్ట్ ఓపెన్ చేస్తున్నాం. చిన్నపాటి గొడవలకే క్షణికావేశంలో హత్యలకు పాల్పడుతున్నారు.

– అశోక్‌కుమార్, ఎస్పీ

మహిళల భద్రతకు ‘భరోసా’

- ఒకేచోట తక్షణ న్యాయ సహాయం, వైద్యసేవలు

జగిత్యాలక్రైం: మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. మహిళలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం పోలీసు శాఖ ఆధ్వర్యంలో కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఒకేచోట న్యాయ సహాయం, వైద్యం, సైకోథెరపీ అందేలా చూస్తోంది. చిన్న పిల్లలపై లైంగిక వేధింపులు, చిత్రహింసల కేసులు ఇటీవల పెరిగిపోతున్నాయి. లైంగికదాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి కేసుల్లో తక్షణ సాయం కోసం ‘భరోసా’ కేంద్రాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. జిల్లా కేంద్రంలో పోలీసు ప్రధాన కార్యాలయం పక్కన గతేడాది పోలీసుశాఖ ఆధ్వర్యంలో కేంద్రాన్ని ప్రారంభించారు. నిరాదరణకు గురైన పిల్లలు, మహిళలకు ఈ కేంద్రంలో తక్షణ వైద్యం, న్యాయ సాయం, కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. కేంద్రంలో వసతి నిపుణులు అండగా ఉండి నిందితులకు శిక్ష పడేలా చూస్తున్నారు. బాధిత పిల్లలకు కొత్త జీవితం ప్రసాదించేలా చర్యలు తీసుకుంటారు. 14 ఏళ్లలోపు పిల్లలు అత్యాచారం, లైంగిక వేధింపులకు గురైన వారు, మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేయగానే కేసు నమోదు చేసి తక్షణ సాయం కోసం భరోసా కేంద్రానికి పంపుతారు. కేంద్రంలో ముందుగా ఏఎన్ఎం వైద్య సాయం అందిస్తారు. పరిస్థితిని బట్టి మెరుగైన వైద్యం, కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. భరోసా కేంద్రం ఎస్పీ పర్యవేక్షణలో మహిళా, శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. సీసీఎస్ సీఐ, హెడ్ కానిస్టేబుల్, మహిళా పోలీసు, ఏఎన్ఎం, బాధితులకు సాయంగా ఉండేందుకు మరో మహిళ, లీగల్ అడ్వైజర్ ఉంటారు. జిల్లా కేంద్రం ధరూర్ క్యాంపులోని ఎస్పీ కార్యాలయం పక్కనే ప్రైవేట్ భవనంలో భరోసా కేంద్రం ఏర్పాటు చేసి గత సంవత్సర కాలంగా బాధితులకు అన్ని రకాలా అండగా నిలుస్తున్నారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు, యువతులు తక్షణ సాయం కోసం 100కు డయల్ చేయటం, లేదా సమీప స్టేషన్‌కు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటారు.

జిల్లాలో నమోదైన లైంగికదాడి కేసులు

2021	: 49
2022	: 36
2023	: 42
2024	: 40
2025లో ఇప్పటి వరకు	: 19



ధరూర్ క్యాంప్‌లోని భరోసా కేంద్రం

మహిళలకు భరోసా

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మహిళల కోసం భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశాం. జిల్లాలో లైంగికదాడులు, నిరాదరణకు గురైన 14 ఏళ్లలోపు ఆడపిల్లలు, మహిళలకు తక్షణ సాయం అందిస్తున్నాం. వైద్య, న్యాయ సాయంతోపాటు నిందితులకు శిక్ష పడేలా పోలీసులు చర్యలు తీసుకుంటారు.

– అశోక్‌కుమార్, ఎస్పీ

క్లుప్తంగా

మెడికల్ షాపులో చోరీ నిందితుల అరెస్టు



నిందితులను అరెస్టు చేసిన త్రీటౌన్ పోలీసులు

కరీంనగర్‌క్రైం: నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని మెడికల్ షాపులో ఈనెల 16న జరిగిన చోరీ కేసులో ముగ్గురు నిందితులను త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి వివరాల ప్రకారం.. హౌసింగ్‌బోర్డుకాలనీలో గౌతం మెడికల్ షాపులో ఈనెల 16న చోరీ జరగగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాలనీలో అద్దెకుంటున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సబ్బీర్ ఆలం అలియాస్ అజ్మల్ హుస్సేన్ అలియాస్ సకీర్, గతంలో సిద్దిపేటలో ఓ హోటల్‌లో పని చేసినప్పుడు ఇతడికి పరిచయమైన బీహార్ రాష్ట్రానికి చెందిన రిజ్వాన్ ఆలం, మహమ్మద్ ఫర్హాన్ ఆలం కలిసి దొంగతనానికి పాల్పడ్డారు. దొంగతనం చేసిన సమయంలో రూ.3వేలు, ఒక సెల్‌ఫోన్ షాపులో ఉండగా.. వాటిని ఎత్తుకెళ్లారు. గతంలో కూడా రాత్రిపూట జరిగిన దొంగతనం కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ముగ్గురిని ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై బి.జగదీశ్వర్, క్రైమ్ పార్టీ కానిస్టేబుళ్లు సాయినేత్ర, ప్రశాంత్‌ను సీఐ అభినందించారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడి రిమాండ్

తిమ్మాపూర్: అల్గునూరు శివారులో ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలువ పక్కన శుక్రవారం మైనర్‌పై అత్యాచారయత్నం కేసులో నిందితుడిని ఎల్‌ఎండీ పోలీసులు ఆదివారం ఉదయం అరెస్టు చేశారు. బోయిన్‌పల్లికి చెందిన విలాసాగర్ గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్ అనే నిందితుడిపై బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉందని ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

వామ్మో.. 'కత్తెర' పురుగు

- వానాకాలం సీజన్‌లోనూ వేధిస్తున్న తెగులు
- రసాయన మందులు పిచికారీ చేస్తున్న మొక్కజొన్న రైతులు
- జిల్లాలో 30వేల ఎకరాల్లో సాగు


కత్తెర పురుగు ఆశించిన మొక్కజొన్నను చూపిస్తున్న రైతు నారాయణ

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వానాకాలం సీజన్‌లో ఆరుతడి పంటగా, అంతర పంటగా సాగు చేసిన మొక్కజొన్న పంటకు పురుగుల బెడద ఇబ్బందికరంగా మారింది. పంట దిగుబడులు ఏమో కాని.. పంటను సాగు చేసిన రైతులకు మాత్రం కత్తెర పురుగు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. పురుగు ఉధృతిని తగ్గించేందుకు రూ.వేల రసాయన మందులను పిచికారీ చేస్తున్నారు. గ్రామ చావడిల వద్ద రైతులు మొక్కజొన్నకు సోకిన కత్తెర పురుగు గురించే చర్చించుకునే పరిస్థితి ఏర్పడింది.

విజృంభణ..

వానాకాలం సీజన్‌లో రైతులు 30వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. ఈసారి వర్షాలు మే చివరి వారంలోనే రావడంతో.. రైతులు మొక్కజొన్న పంటను విడిగా, పసుపు పంటతో కలిపి వేశారు. ఈ పురుగు పంట 15–20 రోజుల తొలి దశ నుంచి ఆశించి పంట చివరి దశ వరకు ఉంటుంది. ఈ పురుగు మూడు దశల్లో పంటను ఆశించి ఆకులను తినడంతో.. ఆకులపై రంధ్రాలు ఏర్పడి మొక్క మొగిలోకి చొరబడి పంటను ఎదగకుండా చేస్తుంది. ముఖ్యంగా ఈ పురుగు ఎక్కువగా యాసంగిలో వస్తుంది. కాని ఈసారి పెద్దగా వర్షాల్లేక కత్తెర పురుగుకు అనువైన వాతావరణం ఏర్పడడంతో ఎక్కువగా విజృంభించింది.

రూ.వేల ఖర్చు

పంట సాగుకే ఎకరాకు రూ.20వేల వరకు ఖర్చవుతుంటే.. ఇప్పుడు కత్తెర పురుగుతో ఒక్కో రైతు కనీసం ఎకరాకు మరో రూ.5వేలు ఖర్చు పెడుతున్నారు. ఇప్పటికే రైతులు 2, 3సార్లు రసాయన మందులు పిచికారీ చేశారు. మొక్క మొగిలో గుళికలు సైతం వేస్తున్నారు. పిచికారీ చేసేందుకు కూలీల ఖర్చు కూడా రైతులకు తడిసి మోపడవుతోంది. అయినా పురుగు ఉధృతి ఆగకపోవడంతో ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు దిగుబడి తగ్గిపోయే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


మొక్కజొన్న పంటను ఆశిస్తున్న కత్తెర పురుగు

తొలి దశలో నివారించాలి

లద్దె పురుగు జాతికి చెందిన కత్తెర పురుగు జీవిత కాలం 60 రోజుల వరకు ఉంటుంది. తల్లి పురుగులు(రెక్కల పురుగులు) గుంపులుగుంపులుగా మొక్కజొన్న కర్రపై గుడ్లను పెడుతుంటాయి. ఒక్కో గుంపులో 1,500–2,000 గుడ్లను పెడతాయి. గుడ్ల నుంచి బయటకొచ్చిన తర్వాత పురుగులు మొక్క ఆకులను గోకి తింటుండటంతో ఆకులకు రంధ్రాలు ఏర్పడతాయి. తర్వాత దశలో పురుగు పెద్దదవుతున్న కొద్ది మొక్క సుడిలోకి ప్రవేశించి రంపం మాదిరిగా కట్ చేస్తూ పంటకు తీవ్ర నష్టం చేస్తాయి. పంట వేసిన దశలో గుడ్లు, చిన్న పురుగుల దశలో ఉంటాయి కాబట్టి నివారణ చర్యలు వెంటనే చేపడితే పంటను కాపాడుకునే అవకాశముంటుంది. ఇందుకోసం ఎకరాకు 5–6 లింగాకర్షక బుట్టలను పెట్టుకోవడంతోపాటు మధ్యస్థ దశలో వేప నూనెను పిచికారీ చేయడం ఉత్తమం.

పిచికారీ చేసిన



మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించడంతో ఇప్పటికే రెండు, మూడుసార్లు రసాయన మందులు పిచికారీ చేసిన. మందులు, కూలీలకు కలిపి రూ.10వేల వరకు ఖర్చయ్యాయి. అయినా మొక్కజొన్న ఆకులకు ఇంకా రంధ్రాలు చేస్తూనే ఉన్నాయి.

– గడ్డం గంగారెడ్డి, చల్‌గల్

పురుగు ఉధృతిని గమనించాలి



మొక్కజొన్న పంట వేసిననుంచి కత్తెర పురుగు ఉధృతిని గమనిస్తూ నివారణ చర్యలు తీసుకోవాలి. గుడ్ల దశలోనే నివారణ చర్యలు తీసుకుంటే పెద్దగా ఇబ్బంది ఉండదు. గుడ్ల నుంచి పిల్ల పురుగులు బయటకొచ్చిన తర్వాత ఎక్కువ నష్టం కలిగిస్తాయి. లింగాకర్షక బుట్టలను పెట్టడంతోపాటు రసాయన మందులు పిచికారీ చేసి పురుగు ఉధృతిని నివారించొచ్చు.

– డాక్టర్ హరీశ్‌కుమార్‌శర్మ, పరిశోధన స్థానం డైరెక్టర్, పొలాస

తెగని 'ఇసుక' పంచాయితీ

- ఇసుక లారీల ద్వారా ఉపాధి కల్పించాలంటూ హిమ్మత్‌నగర్‌వాసుల దీక్ష
- ససేమిరా అంటున్న కొండపాక గ్రామస్తులు
- సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలం


హిమ్మత్‌నగర్‌లో దీక్ష చేస్తున్న గ్రామస్తులు

వీణవంక: రెండు గ్రామాల మధ్య మొదలైన 'ఇసుక' పంచాయితీ కొనసాగుతోంది. ఎన్నోఏళ్లుగా ఒకే రెవెన్యూ గ్రామంగా కలిసిమెలిసి ఉన్న ఆ గ్రామాల ప్రజలు ఇప్పుడు బాహాబాహీకి దిగుతున్నారు. ఇసుక లారీల మీద తాటిపత్రి కప్పే ఉపాధి కొండపాక గ్రామస్తులే పొందుతున్నారని, తమకు మొండిచేయి చూపుతున్నారని వీణవంక మండలం హిమ్మత్‌నగర్ గ్రామస్తులు పదకొండు రోజులుగా నిరసన దీక్ష కొనసాగిస్తున్నారు. ఇసుక కాంట్రాక్టర్, అధికారులు కుమ్మక్కై అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. రెండ్రోజుల్లో న్యాయం జరగకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని స్పష్టం చేస్తున్నారు.

లారీకి రూ.వెయ్యి చొప్పున ఉపాధి

వీణవంక మండలం కొండపాక శివారులోని మానేరువాగులో రెండు ఇసుక క్వారీలు ఉన్నాయి. నెల రోజులుగా ఒక క్వారీ ద్వారా ఇసుక రవాణా జరుగుతోంది. త్వరలో మరోక్వారీ ప్రారంభం కానుంది. ఇసుక నింపిన తరువాత లారీలపై తా టిపత్రి కప్పే ఉపాధిని కొండపాక గ్రామస్తులు పొందుతున్నారు. హిమ్మత్‌నగర్ సైతం కొండపాక రెవెన్యూ గ్రామంలో ఉండటంతో తమకూ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. టీజీ ఎండీసీ నిబంధనల ప్రకారం ఇసుక లారీలపై తా టిపత్రులు కప్పుకొని రవాణా చేయాలి. తాటిపత్రి కప్పితే ఒక్కో లారీ నుంచి రూ.వేయి వసూలు చేస్తున్నారు. రోజుకు 50లారీలు లోడైనా రూ.50 వేల ఉపాధి లభిస్తుంది. లారీలు హిమ్మత్‌నగర్ గ్రామం నుంచి వెళ్తున్నాయని, తమకూ ఉపాధి కల్పించాలని 20రోజులుగా ఆందోళన చేస్తున్నా రు. కేంద్రమంత్రి బండి సంజయ్, కలెక్టర్ పమేలా సత్పతి, టీజీఎండీసీ అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. అయితే క్వారీలు తమ పరిధిలో ఉన్నందున తమకే వాటా దక్కుతుందని కొండపాక గ్రామస్తులు తెగేసి చెబుతున్నారు.

అమరణ దీక్షకు సిద్ధమవుతున్న గ్రామస్తులు

పదకొండు రోజులుగా హిమ్మత్‌నగర్ గ్రామస్తులు గ్రామ పంచాయతీ ఆవరణలో నిరసన దీక్ష చేపడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని రెండు, మూడురోజుల్లో ఆమరణదీక్షకు దిగేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామాభివృద్ధికి ఒక్కో లారీ నుంచి కనీసం రూ.500 ఇప్పించాలని, సబ్ రిజిస్ట్రార్ నుంచి వచ్చే నిధులు కొండపాక రెవెన్యూలో జమవుతున్నాయని, నేరుగా హిమ్మత్‌నగర్ జీపీకి ట్రాన్స్‌ఫర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొంటున్నారు.

బండరాళ్లు దొర్లి పడి బాలుడి మృతి

- మరో బాలుడికి గాయాలు
- తల్లి కళ్ల ముందే బండల కింద తనయుడి విలవిల.. స్పృహ కోల్పోయిన తల్లి
- రేకులపల్లిలో విషాదం


ధనుశ్(ఫైల్)

సారంగాపూర్: అమ్మ పొలం వద్ద ఉందని వెళ్లిన ఓ బాలుడు అనంత లోకాలకు వెళ్లిన ఘటన రేకులపల్లిలో విషాదం నింపింది. బండరాళ్ల మీద కూర్చొని ఉన్న సమయంలో బండరాళ్లు కదిలి పడడంతో కడ ధనుశ్(11) మృతిచెందగా.. మరో బాలుడు కడ అఖిలేశ్(14) తీవ్రంగా గాయపడ్డాడు. రేకులపల్లి గ్రామానికి చెందిన కడ రాజేందర్–శిరీషకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ధనుశ్ బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామ ఉన్నత పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో నాన్న రాజేందర్ గొర్లను మేపడానికి వెళ్లగా.. అమ్మ శిరీష పొలం పనులకు వెళ్లింది. అమ్మ ట్రాక్టర్ సహాయంతో పొలం దున్నిస్తోంది. అమ్మ పొలం వద్దే ఉండడంతో ధనుశ్ వరసకు అన్న అయిన అఖిలేశ్(14)తో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. పొలంలోనే ట్రాక్టర్ కేజీవీల్స్‌తో దున్నుతుండడంతో పొలానికి మోటార్ల సహాయంతో నీరు పెట్టారు. పొలంలో మధ్యలో ఉన్న బిలుకు(బండలతో కూడి ఉన్న ఎత్తయిన ప్రాంతం)లో బండరాళ్లు కుప్పగా పెట్టి ఉండగా.. ధనుశ్, అఖిలేశ్ వాటిపై కూర్చొని ఫోన్ చూస్తూ, పొలం దున్నడాన్ని పరిశీలిస్తూ మాట్లాడుకుంటున్నారు. ఇదే సమయంలో తాము కూర్చొని ఉన్న బండరాళ్ల కిందికి పొలానికి పెట్టిన నీరు వచ్చి చేరుతోంది. ఈ విషయాన్ని వారు గమనించలేకపోయారు. బండల కిందికి పెద్దఎత్తున నీరు చేరడంతో ఒక్కసారిగా కుప్పగా ఉన్న రాళ్లు కదిలి ధనుశ్, అఖిలేశ్ బండల కుప్పపై నుంచి కింద పడిపోయారు. అందులోని ఓ పెద్ద రాయి ధనుశ్ తల, శరీరంపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అఖిలేశ్ కూడా గాయాల పాలయ్యాడు. ఒక్కసారిగా ఊహించని సంఘటన చూసిన ధనుశ్ తల్లి సొమ్మసిల్లిపోయింది. అప్రమత్తమైన ట్రాక్టర్ డ్రైవర్, సమీపంలోని రైతులు వెంటనే 108లో వీరిని జగిత్యాలకు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో ధనుశ్ మృతిచెందాడు. అఖిలేశ్ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

బిలుకుపై పేర్చడంతోనే..

గడిచిన యాసంగి పూర్తయిన వెంటనే పొలం మధ్యలో అక్కడక్కడున్న పెద్దపెద్ద బండరాళ్లను ధనుశ్ తల్లిదండ్రులు పొక్లయిన్ సహాయంతో తొలగించి బిలుకుపై కుప్పగా పేర్చారు. బండలను తొలగిస్తే భూమి సేద్యం మరింత అనుకూలంగా ఉంటుందని భావించారు. అదే కుప్పపై సరదాగా ధనుశ్, అఖిలేశ్ కూర్చొని ప్రమాదానికి గురయ్యారు. ధనుశ్ తల్లిదండ్రులు, అఖిలేశ్ తల్లిదండ్రులు భూమేశ్వరి, వెంకటేశ్, గ్రామస్తులు కన్నీటిపర్యంతమవుతున్నారు. అఖిలేశ్ బీర్‌పూర్ మండలం కొల్వాయి ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్నాడు. సంఘటనా స్థలాన్ని బీర్‌పూర్ ఎస్సై రాజు పరిశీలించారు. మృతదేహం పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాశరథి తెలంగాణ ఆస్తి

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్


మాట్లాడుతున్న గంగుల కమలాకర్

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ అంత ఎత్తుకు ఎదిగిన కవి దాశరథి అని, ఆయన ఏ ఒక్కరి సొత్తు కాదని, తెలంగాణ రాష్ట్రానికి అసలు సిసలైన సాహిత్య ఆస్తి దాశరథి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ రచయితల సంఘం కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఫిలిం భవన్‌లో జరిగిన దాశరథి శత జయంతి వేడుకలకు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి కార్యక్రమాలు చేయకుండా దాశరథిని విస్మరించిందని, దాశరథి శత జయంతిని ప్రభుత్వపరంగా సంవత్సరంతా నిర్వహిస్తూ ఉత్సవాలు చేయాలని, దాశరథి పురస్కారాన్ని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. దాశరథి శత జయంతి సదస్సును ఘనంగా నిర్వహిస్తున్న సంస్థ అధ్యక్షుడు కొత్త అనిల్‌కుమార్, అతడి కార్యవర్గాన్ని అభినందించారు. దాశరథి జీవితం, సాహిత్యంపై డాక్టర్ గన్నమరాజు గిరిజామనోహర్‌బాబు, దాశరథి సినిమా సాహిత్యంపై నిజాం కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ తిరునగరి శరత్‌చంద్ర ఉపన్యాసాలు చేశారు. కవులను గంగుల కమలాకర్ సన్మానించారు. కవులు డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, గజేందర్ రెడ్డి, డి.రాజారామ్మోహన్, గాజుల రవీందర్, శంకర్‌ప్రసాద్, కాందూరి వెంకటేశ్వర్లు, నీలగిరి అనిత, చిందం సునీత, బొమ్మకంటి కిషన్ తదితరులున్నారు.

డ్రగ్స్‌పై దృష్టి పెట్టండి

- పోలీసులను ఆదేశించిన మంత్రి శ్రీధర్‌బాబు


ఏసీపీ, సీఐతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

తిమ్మాపూర్: జిల్లాలో డ్రగ్స్‌పై దృష్టి పెట్టాలని పోలీసులను మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశించారు. ఎల్‌ఎండీ ఎస్సారెస్పీ గెస్ట్ హౌస్‌లో మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆదివారం పలు విషయాలపై మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ.. తిమ్మాపూర్ మండలంలోని విద్యాసంస్థలపై ఫిర్యాదులు వస్తున్నాయని ఏసీపీ వెంకటస్వామి, తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్‌తో అన్నారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులు డ్రగ్స్ తీసుకుంటే కాలేజీలు బాధ్యత వహించాలని, యాజమాన్యాలు బాధ్యులని అన్నారు. డ్రగ్స్ తీసుకున్నవారిని గుర్తించేందుకు ప్రత్యేక కిట్లు వచ్చాయని, యువకులకు పరీక్షలు నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు. నాయకులు అబ్దుల్ సమద్, నారోజు రాకేశ్, కాళ్ల రవి, బోయిని ప్రశాంత్, సురేందర్ తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మహేందర్(ఫైల్)


మహేందర్ మృతదేహం

కోనరావుపేట: నిమ్మపల్లిలో విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందాడు. గ్రామానికి చెందిన అనుముల లచ్చిరెడ్డి–లచ్చవ్వ కుమారుడు మహేందర్(33) ఆదివారం సాయంత్రం తన వ్యవసాయ క్షేత్రం వద్ద యంత్రంతో గడ్డి కోస్తున్నాడు. అదే ప్రాంతంలో విద్యుత్ స్తంభం నుంచి మోటారు వరకు వెళ్లే తీగ ఉంది. గడ్డిని కోస్తుండగా తీగ తెగి యంత్రానికి విద్యుత్ ప్రసారమైంది. విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య మమత, కుమారుడు, కూతురున్నారు.

యువకుడి బలవన్మరణం


అశోక్(ఫైల్)

కొడిమ్యాల: పెళ్లి కావడం లేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సందీప్ కథనం ప్రకారం.. పూడూర్ గ్రామనికి చెందిన చిలువేరు అశోక్(36) కొంతకాలంగా వివాహం కావడం లేదని తీవ్ర నిరాశకు లోనై ఈనెల 11న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి నరసింహరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


రాజయ్య మృతదేహం

జగిత్యాలక్రైం: పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో జయశంకర్ విగ్రహం చౌరస్తా వద్ద ఆదివారం సాయంత్రం సైకిలిస్టును క్రేన్ ఢీకొనగా.. పోచంపల్లి రాజయ్య (55) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. గొల్లపల్లి మండలం రాపల్లి గ్రామానికి చెందిన రాజయ్య జగిత్యాలలోని భవానినగర్‌లో నివాసముంటున్నాడు. ఆదివారం సాయంత్రం పని నిమిత్తం సైకిల్‌పై వస్తుండగా.. క్రేన్ డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా వచ్చి రాజయ్యను ఢీకొట్టాడు. రాజయ్య తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

లాండ్రీ షాప్ దగ్ధం


దగ్ధమైన లాండ్రీ షాప్‌ను చూపుతున్న నారాయణ

రుద్రంగి: మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో లాండ్రీ షాప్ దగ్ధమైంది. మండల కేంద్రానికి చెందిన లింగంపల్లి నారాయణ లాండ్రీ దుకాణంలోని బట్టలు, సామగ్రి కాలి బూడిదయ్యాయి. కొన్ని సంవత్సరాలుగా లాండ్రీ షాప్ నడిపిస్తూ జీవనోపాధి పొందుతున్నానని, ప్రస్తుతం జీవనోపాధి లేకుండా పోయిందని నారాయణ ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ అంతరాయం ఏర్పడి విద్యుత్ రావడంతో మంటలు చెలరేగి ఇస్త్రీ పెట్టె, కస్టమర్లు ఇచ్చిన బట్టలు కాలిపోయాయని రోదించాడు.

మ్యాట్రిమోనిలో పరిచయం.. క్రిప్టోలో మోసం

మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ యువకుడు పెళ్లి సంబంధం కోసం మ్యాట్రిమోనిలో తన పేరును రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. తాను విజయవాడకు చెందిన అమ్మాయినని, తనకు పెళ్లి కాలేదని, తన పేరు నందినిరెడ్డిగా పరిచయం చేసుకుంది. ఇలా మాటల్లో దింపి.. తనకు తండ్రి లేదని, తాను బిజినెస్‌లో సంపాదిస్తున్నానని, క్రిప్టోమనీలో పెట్టుబడి పెడితే భారీగా సంపాదించొచ్చని చెప్పింది. దీన్ని నమ్మిన యువకుడు ముందుగా రూ.68,600 పంపించగా.. రూ.5వేలు లాభం వచ్చిందని చూపించింది. ఆ తర్వాత వరుసగా రూ.87.58లక్షలు పంపించి భారీ లాభాల కోసం ఎదురుచూశాడు. తర్వాత అమ్మాయి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానం వచ్చి సైబర్ క్రైంలో ఫిర్యాదు చేశాడు.

పార్ట్ టైం జాబ్ పేరుతో టెలిగ్రామ్‌లో సైబర్ నేరగాళ్లు లింక్ పంపారు. దీన్ని నమ్మిన నిరుద్యోగి దరఖాస్తు చేసుకున్నాడు. మంచిర్యాల జిల్లా సీసీసీకి చెందిన వ్యక్తి రోజు రివ్యూ చేయాలని సూచించారు. ఒకరోజు రివ్యూకు రూ.3వేలు ప్రాఫిట్ చెల్లించారు. మొదటగా రూ.10వేలు డిపాజిట్ చేయగా.. రూ.3వేలు లాభం ఇచ్చారు. ఆ తర్వాత టెలిగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేసి డబ్బులు డిపాజిట్ చేయాలని సూచించారు. దీంతో ఒకసారి రూ.10లక్షలు, ఆ తర్వాత రూ.5లక్షలు.. ఇలా రూ.17లక్షలు మోసపోయాడు. అయితే డిజిటల్ లాభాలు చూపించినా వాటిని తీసుకోవడానికి వీలు కాలేదు. దీంతో మోసం గ్రహించి సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 11న కేసు నమోదైంది.

- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- డబ్బులు పోగొట్టుకుంటున్న జనం
- బయటకు చెప్పలేక సతమతం

రామగుండం సైబర్ క్రైం ద్వారా జరిగిన మోసాలు
గడిచిన 7 నెలల్లో 19 కేసులు నమోదు
మోసపోయిన సొమ్ము రూ.6.07కోట్లు
రికవరీ అయిన సొమ్ము రూ.2.80కోట్లు

గోదావరిఖని: ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు రోజుకో తరహా కొత్త మోసాలకు తెర లేపుతున్నారు.. ఈజీ మనీకి అలవాటు పడిన సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. రోజుకో తీరున మోసం చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఇన్నాళ్లు బ్యాంకు, ఏటీఎం, క్రెడిట్ కార్డులు, వాట్సాప్ లింకులతో దోచుకున్న కేటుగాళ్లు.. కొత్త దారులను వెతుకుతున్నారు. ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల నుంచి యువతుల ఫొటోలను సేకరించి వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం డీపీలుగా పెట్టుకొని మెసేజ్‌లను పంపిస్తారు. ఆన్‌లైన్‌లో నకిలీ మ్యాట్రిమోని సృష్టించి అందులో రిజిస్టర్ కాగానే వారిని ఉచ్చులో దింపి భారీగా మోసం చేస్తున్నారు. ఈ విషయంలో ఉన్న డబ్బులు పొగొట్టుకునేంత వరకు తాము మోసం పోయామనే విషయాన్ని గ్రహించడం లేదు. ఈ విషయంలో పూర్తిగా నష్టపోయిన కొందరు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయిస్తుండగా.. మరికొందరు డబ్బులు పోయినా పరువు పోవద్దనే ఆలోచనతో పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు.

ఇన్‌స్టాగ్రాం లింకులతో మోసం

తాజాగా ఉద్యోగాలిప్పిస్తామని టెలిగ్రామ్‌లో లింకులు పంపి మోసం చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా సీసీసీకి చెందిన ఓ యువకుడికి ఉద్యోగం ఇప్పిస్తామని, అందుకోసం లింక్ ఓపెన్ చేయాలని కోరారు. లింక్ ఓపెన్ చేసిన తర్వాత ముందుగా రూ.10వేలు డిపాజిట్ చేయాలని చెప్పారు. దానికి రూ.3వేలు లాభం చూపించారు. ఇలా పలు దఫాలుగా రూ.17లక్షలు డిపాజిట్ చేయగా.. పంపిన డబ్బులు, వాటికి సంబంధించిన లాభాలు డిజిటల్‌లో కనిపించినా వాటిని తీసుకోవడానికి వీలు కాలేదు. దీంతో సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. మంచిర్యాలకు చెందిన ఓ పోస్టు గ్రాడ్యుయేట్ చేసిన ఓ గృహిణి ఇన్‌స్టాగాం లింక్ ద్వారా రూ.41లక్షలు మోసపోయింది. ఇలా రోజుకో రకంగా సైబర్ నేరగాళ్లు ప్రజలపై విరుచుకపడుతున్నారు. సెల్‌ఫోన్ చేతిలో ఉంటే ప్రపంచం చేతిలో ఉన్నట్లుగానే



సైబర్ నేరగాళ్లు చేతిలో ఉన్న సెల్‌ఫోన్ ద్వారా ఉన్నదంతా కొల్లగొడుతున్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం లింకుల విషయంలో ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. నకిలీ వెబ్‌సైట్లలో తమ పేర్లను నమోదు చేసి మోసపోవద్దని సూచిస్తున్నారు.

అప్రమత్తంగా ఉంటేనే భద్రం



ఆన్‌లైన్ ఉద్యోగాల పేరుతో వచ్చే ప్రకటనలు నమ్మొద్దు. ఇన్‌స్టాగ్రాం ద్వారా ఇటీవల కాలంలో చాలా మోసాలు జరుగుతున్నాయి. అందులో లింకులను పంపి ఉద్యోగాలు ఇప్పిస్తామని, పెట్టుబడి పెడితే లాభాలు ఇస్తామని నమ్మించి నట్టేట ముంచుతున్నారు. మ్యాట్రిమోని పేరుతో అమ్మాయిలు పరిచయం చేసుకొని షేర్ మార్కెట్ క్రిప్టో కరెన్సీ పేరుతో తప్పుడు సైట్లు సృష్టించి రూ.లక్షలు కొల్లగొడుతున్నారు. ఈ విషయంలో ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి.

– డి.వెంకటరంగారెడ్డి, ఏసీపీ, సైబర్ క్రైం, రామగుండం

ఐటీఐ కళాశాలలో దరఖాస్తులు ఆహ్వానం

- అందుబాటులో 240 ఐటీఐ, 172 ఏటీసీ కోర్సుల సీట్లు



కరీంనగర్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల

సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రస్తుత కాలంలో పదోతరగతి అనంతరం చాలా కోర్సులు విద్యార్థులు చదివేందుకు అందుబాటులో ఉంటున్న సంగతి తెలిసిందే. ఇటీవలి కాలంలో ప్రభుత్వ విద్యార్థులల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడానికి ఐటీఐ విద్యను పటిష్టం చేసే దిశగా అడుగులు వేసింది. దీంట్లో భాగంగానే 2025–26 విద్యాసంవత్సరం నుంచి ఐటీఐ విద్యలో కొత్త ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) తరహా కోర్సులు ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఆన్‌లైన్ వేదిక దరఖాస్తులు ప్రారంభం కాగా.. తొలి విడత సీట్ల కేటాయింపు పూర్తయింది. రెండో విడతలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. రెండో విడత ఆగస్టు 31 వరకు జరగనుంది. మిగిలిన సీట్లు స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తారు.

కరీంనగర్ కళాశాలలో..

కరీంనగర్‌లోని ఉజ్వల పార్క్ సమీపంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) కళాశాలలో మొత్తం 412 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అందులో 240 సీట్లు ఐటీఐ కాగా.. 172 సీట్లు ఏటీసీ కోర్సుల సీట్లు. తొలి విడతలో ఐటీఐలో 54 సీట్లు అలాట్ అయ్యాయి. రెండో విడత సీట్ల కేటాయింపు ప్రారంభం కానున్న సందర్భంగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఐటీఐ కళాశాల కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ వై.గంగాధర్ తెలిపారు. ఐటీఐ కోర్సులు విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి రంగంలో అధిక డిమాండ్ ఉందని పేర్కొంటున్నారు. ఉత్తీర్ణులైన వారికి నేరుగా కంపెనీలే వచ్చి ఉద్యోగాలు కల్పిస్తున్నాయని, చాలా ఉపాధి అవకాశాలున్నాయని, కచ్చితంగా ఉపాధి దొరుకుతుందంటున్నారు.

ఉపాధికి మార్గం..



ఐటీఐ చదివిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయి. దినదినం ఐటీఐల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. సొంతంగా కంపెనీలు ఏర్పాటు చేసుకునే వీలుంటుంది. ఆర్థిక భరోసాకు అండగా ఐటీఐ కోర్సులు దోహదం చేస్తాయి.

– డాక్టర్ వై.గంగాధర్, ఐటీఐ కళాశాల కమిటీ వైస్ చైర్మన్